విద్యుత్ వృథాపై పట్టింపేదీ!

- రేయింబవళ్లు వెలుగుతున్న వీధిలైట్లు
- త్రీఫేజ్ లైన్, ఆన్ ఆఫ్ స్విచ్‌లు లేకపోవడమే కారణం
- పట్టించుకోని అధికారులు


మునగాలలో పగలు వెలుగుతున్న వీధిలైట్లు

మునగాల : మునగాల మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని పలు వార్డుల్లో వీధిలైట్లు రేయింబవళ్లు వెలుగులు విరజిమ్ముతున్నాయి. ఆన్ ఆఫ్ స్విచ్‌లు ఏర్పాటు చేయకపోవడంతో గత రెండేళ్లుగా వీధి దీపాలు నిరంతరం వెలుగుతూ విద్యుత్ వృథా అవుతోందని పలువురు ఆరోపిస్తున్నారు. గ్రామపంచాయతీ పరిధిలో సుమారు 560 వీధిలైట్లు ఉండగా సుమారు 30 స్తంభాలకు ఏర్పాటు చేసిన వీధిలైట్లు నిరంతరం వెలుగుతున్నాయి. అయితే కొన్ని వార్డుల్లోని విధుల్లో త్రీఫేజ్ లైన్ లేకపోవడం, పలు విధుల్లో త్రీఫేజ్ లైన్ ఉన్నప్పటికీ ఆన్ ఆఫ్ స్విచ్‌లు ఏర్పాటు చేయకపోవడంతో వీధుల్లో లైట్లు నిరంతరం వెలుగుతున్నాయి. ఈ విషయమై గతంలో తాజా మాజీ సర్పంచ్ చింతకాయల ఉపేందర్ పలుమార్లు గ్రామపంచాయతీలో తీర్మానం చేసి సంబంధిత శాఖకు తెలియజేసినప్పటికీ వారు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాగా, గ్రామ పంచాయతీ ప్రతి నెల వీధిలైట్లు, నీటి సరఫరాకు చెందిన విద్యుత్ మోటార్లకు సంబంధించి రూ.లక్షన్నర బిల్లులు చెల్లిస్తుంది. విద్యుత్‌శాఖ అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి త్రీఫేజ్ లైన్ ఏర్పాటు చేయాలని, పలు చోట్ల ఆన్ ఆఫ్ స్విచ్‌లు ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాలప్రజలు కోరుతున్నారు.

విద్యుత్ వృథాను అరికట్టాలి

మునగాల గ్రామపంచాయతీ పరిధిలోని పలు వార్డుల్లో వీధిలైట్లు రేయింబవళ్లు వెలుగుతున్నాయి. దీంతో విద్యుత్ వృథా అవుతోంది. ఇప్పటికైనా గ్రామపంచాయతీ పాలకవర్గం, విద్యుత్ శాఖ ప్రత్యేక శ్రద్ధ వహించి విద్యుత్‌ను ఆదా చేయాలి.

– చింతకాయల నాగరాజు, మునగాల

ఆన్ ఆఫ్ స్విచ్ ఏర్పాటు చేసుకోవాలి

మండల కేంద్రంలోని రెండు వార్డుల్లో సుమారు 30కి పైగా వీధిలైట్లు నిరంతరం వెలుగుతున్నాయని మా దృష్టికి వచ్చింది. కొన్ని వీధుల్లో త్రీఫేస్ లైన్ లేకపోవడం, మరికొన్ని వీధుల్లో లైట్లకు ఆన్ ఆఫ్ స్విచ్ లేకపోవడమే నిరంతరం లైట్లు వెలగడానికి కారణం. గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఆన్ ఆఫ్ స్విచ్ ఏర్పాటు చేసుకోవాలి.

– వికాస్, ట్రాన్స్‌కో ఏఈ, మునగాల

పరిశీలించి విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్తా

నేను ఇటీవల మునగాల గ్రామపంచాయతీ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టాను. వీధి లైట్లు నిరంతరం వెలుగుతున్న విషయం నా దృష్టికి రాలేదు. ఆయా వీధుల్లో స్తంభాలను పరిశీలించి పగలు కూడా లైట్లు వెలిగితే విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్తా.

– ఫరీద్, పంచాయతీ కార్యదర్శి, మునగాల

క్లుప్తంగా

20న మండల సర్వసభ్య సమావేశం

మోతె : మోతె మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 20న నిర్వహించనున్నట్లు మండల అభివృద్ధి అధికారి హరిసింగ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, మండల, గ్రామ స్థాయి ప్రత్యేక అధికారులు విధిగా పాల్గొనాలని కోరారు.

వృద్ధాశ్రమంలో చీరల పంపిణీ


వృద్ధులకు చీరలు పంపిణీ చేస్తున్న నాగయ్య

మునగాల : మండలంలోని ముకుందాపురం గ్రామపంచాయతీ పరిధిలో గల ఇందిర అనాథ వృద్ధాశ్రమంలో వృద్ధులకు సోమవారం మునగాలకు చెందిన సుంకరి నాగయ్య చీరలు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాగయ్య మాట్లాడుతూ ప్రతియేటా తాను వృద్ధాశ్రమంలో చీరలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ప్రతిఒక్కరూ మానవతా దృక్పథంతో పేద ప్రజలకు సేవ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో లంజేపల్లి ఈదయ్య, ఆశ్రమ నిర్వాహకురాలు నాగిరెడ్డి విజయమ్మ, సిబ్బంది వాచేపల్లి భవ్య, రాధ పాల్గొన్నారు.

బియ్యం, సరుకులు అందజేత


బియ్యం, సరుకులు అందజేస్తున్న భజన బృందం సభ్యులు

హుజూర్‌నగర్ : మఠంపల్లి మండలం ఒక్కమంతులగూడెంలో జరిగే లక్ష్మీతిరుపతమ్మ కల్యాణ మహోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నదానానికి హుజూర్‌నగర్ అన్నమయ్య భజన మండలికి అనుబంధంగా ఉన్న భజన బృందం వాట్సప్ గ్రూప్ సభ్యుల ద్వారా సేకరించిన 3 క్వింటాళ్ల బియ్యం, సరుకులను సోమవారం ఆలయ చైర్మన్ సీహెచ్.నాగమణి నాగేశ్వరరావుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రూప్ అడ్మిన్ ఆకుల రజిని రాము, అన్నమయ్య భజన మండలి వ్యవస్థాపక అధ్యక్షుడు బాచిమంచి కొండయ్య, స్థానికులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు చేయూత


విద్యార్థులకు బ్యాగులు, టిఫిన్ బాక్స్‌లు అందజేస్తున్న దాతలు

గరిడేపల్లి : మండల పరిధిలోని పరెడ్డిగూడెం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు కందుల రామ్‌కిషోర్‌రెడ్డి –పూర్ణిమారెడ్డి దంపతుల కుమార్తె పూర్విరామ్ అన్న ప్రసన్న సందర్భంగా రూ.8వేల విలువ గల బ్యాగులు, టిఫిన్ బాక్స్‌లు తదితర సామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు గుగులోతు సైదానాయక్ మాట్లాడుతూ.. పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి దాతలు సహకరించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హుజూర్‌నగర్ : పట్టణంలో మఠంపల్లి బైపాస్ రోడ్ విస్తరణ పనుల్లో భాగంగా విద్యుత్ స్తంభాలు నిలబెట్టేందుకు హుజూర్‌నగర్‌లోని రెడ్డి బజార్ అంబేద్కర్ కాలనీ, మఠంపల్లి బైపాస్ రోడ్, లక్కవరం రోడ్డు, అనుముల గూడెం ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ ఏఈ రాంప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

16న నిత్యాన్నదాన సత్రం కార్యవర్గ ఎన్నికలు


సమావేశంలో పాల్గొన్న విశ్వబ్రాహ్మణులు

గరిడేపల్లి : మట్టపల్లి శ్రీలక్ష్మీనర్సింహస్వామి సన్నిధిలోని విశ్వబ్రాహ్మణ నిత్యాన్నదాన సత్రం కమిటీని ఎన్నుకొని మూడు సంవత్సరాలు పూర్తయినందున ఈ నెల 16న ఆలయ సన్నిధిలో నూతన కార్యవర్గ ఎన్నికలు నిర్వహించనున్నట్లు విశ్వబ్రాహ్మణ నిత్యాన్నదాన సత్ర కమిటీ సభ్యులు తెలిపారు. సోమవారం గరిడేపల్లి మండల కేంద్రంలో వారు విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ విశ్వబ్రాహ్మణులు ఎన్నికల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఏసీపీ పల్లె కాశిరెడ్డికి సన్మానం


ఏసీపీ పల్లె కాశిరెడ్డిని సన్మానిస్తున్న మిత్రులు

హుజూర్‌నగర్ రూరల్ : హైదరాబాద్‌లోని వనస్థలిపురం అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ఏసీపీ) పల్లె కాశిరెడ్డిని ఆయన మిత్రులు సోమవారం ఘనంగా సన్మానించారు. ఏసీపీగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలిసారి తన స్వగ్రామమైన హుజూర్‌నగర్ మండలంలోని వేపలసింగారంనకు వచ్చిన ఆయనను పదవ తరగతి మిత్రులు శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పదవ తరగతి మిత్రులు పాల్గొన్నారు.

చౌటపల్లి ఆలయ భూముల కౌలు వేలం


చౌటపల్లి ఆలయంలో వేలం నిర్వహిస్తున్న అధికారులు, పాల్గొన్న కౌలు రైతులు

మఠంపల్లి : మండలంలోని చౌటపల్లిలో శ్రీరుక్మిణీ సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి దేవాలయ భూముల కౌలు వేలం ద్వారా ఆలయానికి రూ.2,71,800లు ఆదాయం సమకూరిందని ఆలయ ఇన్‌చార్జ్ ఈఓ చలపతిరావు తెలిపారు. సోమవారం ఆలయంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు ఆలయ భూముల కౌలుకు బహిరంగ వేలం పాట నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవాలయం పరిధిలోని సర్వే నంబర్లు 593, 594, 726 లలో గల 15 ఎకరాల 30 గుంటల వ్యవసాయ భూమికి ఒక ఏడాది (యాసంగి, వానాకాలం) కాలానికి కౌలు వేలం నిర్వహించగా గ్రామానికి చెందిన రైతులు ఐతగాని పిచ్చయ్య, కారింగుల పిచ్చయ్య, కొండా నాగేశ్వరరావులు వేలం పాటలో దక్కించుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పరిశీలకులు, ఈఓ వెంకటనారాయణ, ఎండోమెంట్ సిబ్బంది గోవిందరెడ్డి, కిరణ్‌గౌడ్, గ్రామ పెద్దలు సింగారపు సైదులు, మద్ది హుస్సేన్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, లచ్చిరెడ్డి, నరసయ్య, కోటయ్య, అర్చకులు, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


నేరేడుచర్ల : ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు

నేరేడుచర్ల : పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2004 –2005 విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదివిన విద్యార్థులు సోమవారం ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా జరుపుకున్నారు. రెండు దశాబ్దాల తరువాత ఒకే వేదికపైన కలుసుకున్న వారు ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల నాటి మధుర స్మృతులను నెమరవేసుకున్నారు. ఆనాటి ప్రధానోపాధ్యాయులు పోరెడ్డి శ్రీరాంరెడ్డి, కొప్పుల రంగారెడ్డి, ఉపాధ్యాయులు పి.చంద్రారెడ్డి, ఎం.సువర్ణ, చిన్నప్ప, పీటీఈ వెంకట్‌రెడ్డి, సుందర్‌రావు, పద్మావతి, శ్రీనివాస్‌రావులను పూర్వ విద్యార్థులు ఘనంగా సత్కరించారు. పాఠశాలలో మంచినీటి సౌకర్యం కోసం రూ.25 వేల వ్యయంతో వాటర్ ప్లాంటు ఏర్పాటు చేయిస్తామని పూర్వ విద్యార్థులు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రస్తుత ప్రధానోపాధ్యాయుడు బట్టు మధు, పూర్వ విద్యార్థులు శ్రవణ్‌కుమార్, బాలకృష్ణ, నరేష్, చిన్నామ్మయి, నాగరాజు, సూర్య ప్రకాశ్, చంటి, జానకి, నాగమ్మ, వెంకటరమణ, రాణి, శ్రీను తదితరులు ఉన్నారు.

వేపలసింగారంలో..

హుజూర్‌నగర్ రూరల్ : మండలంలోని వేపలసింగారంలో 1995– 96లో పదవ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు సోమవారం ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా గత స్మృతులను నెమరువేసుకున్నారు. అనంతరం నాటి ఉపాధ్యాయులను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పెనుగొండ శ్రీనివాస్, చంద్రం, పద్మావతి, లీలా, అనిత, భవాని, ఆర్పీఎం హెచ్ఎస్ సిస్టర్లు తదితరులు పాల్గొన్నారు.


హుజూర్‌నగర్‌రూరల్ : ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు

నిర్లక్ష్యం వహిస్తున్న సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని వినతి

హుజూర్‌నగర్ : ఏరియా హాస్పిటల్‌కు వచ్చే రోగుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న సిబ్బందిపై తగిన చర్యలు తీసుకోవాలని ఆరోగ్యమే మహా భాగ్యం ట్రస్ట్ చైర్మన్ వెంకీ కోరారు. ఈమేరకు సోమవారం హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ కరుణ్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. రోగుల విషయంలో, వారి బంధువుల విషయంలో సిబ్బంది పూర్తి నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తున్నారని ఆయన వినతిపత్రంలో పేర్కొన్నారు.

వెంకటరెడ్డి సేవలు చిరస్మరణీయం


వెంకటరెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కుటుంబసభ్యులు, నాయకులు

మునగాల : టీడీపీ కోదాడ నియోజకవర్గ నాయకుడు, కోదాడ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ జెట్టి వెంకటరెడ్డి సేవలు చిరస్మరణీయమని పలువురు నాయకులు అన్నారు. సోమవారం మునగాల మండలంలోని బరాఖత్‌గూడెం గ్రామంలో జెట్టి వెంకటరెడ్డి 23 వర్ధంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. టీడీపీ గ్రామశాఖ అధ్యక్షుడు చల్లా గుర్వయ్య, కుటుంబసభ్యులు జెట్టి రామిరెడ్డి, నర్రా రామనర్సిరెడ్డి, జెట్టి నర్సిరెడ్డి, జెట్టి వీరారెడ్డి, కేతిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు.

స్వర్ణప్రాసన ఔషధం పంపిణీ

కోదాడరూరల్ : పదహారు సంవత్సరాలలోపు పిల్లలకు రోగ నిరోధక శక్తి పెంచేందుకు స్వర్ణప్రాసన మందు ఎంతో ఉపయోగపడుతుందని ఆయుర్వేద డాక్టర్ సురేష్ జకోటియా అన్నారు. సోమవారం కోదాడ పట్టణ పరిధిలోని తమ్మరలో గల ఆయుర్వేద వైద్యశాలలో పుష్య నక్షత్రాన్ని పురస్కరించుకొని వాసవీ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో 16 సంవత్సరాలలోపు పిల్లలకు ఉచిత స్వర్ణప్రాసన ఔషధాన్ని పంపిణీ చేసి మాట్లాడారు. ఈ స్వర్ణప్రాసనాన్ని తీసుకోవడంతో రోగ నిరోధక శక్తి పెరగడంతో పాటు మానసిక వికాసము, పెరుగుదల బాగుంటుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు వంగవీటి భరత్‌చంద్ర, గడ్డం లక్ష్మీప్రసన్న, అనంతచక్రవర్తి, నిఖిల్, రాయపుడి వెంకటనారాయణ, లక్ష్మీనర్సయ్య, జగిని ప్రసాద్, గురుమూర్తి ఉన్నారు.


స్వర్ణప్రాసన ఔషధం పంపిణీ చేస్తున్న డాక్టర్ సురేష్ జకోటియా, తదితరులు

కంఠమహేశ్వరస్వామి పండుగకు రావాలని ఉత్తమ్‌కు ఆహ్వానం


మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని సన్మానిస్తున్న గౌడ సంఘం పెద్దలు, నాయకులు

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్‌లో ఈనెల 16న నిర్వహించబోయే గౌడ కుల దైవమైన శ్రీకంఠమహేశ్వర స్వామి పండుగకు హాజరుకావాలని కోరుతూ సోమవారం నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డికి హుజూర్‌నగర్ పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో గౌడ సంఘ పెద్దలు ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా వారు మంత్రిని శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం పెద్దలు, పెద్ద గౌడ్‌లతో పాటు గీత కార్మికులు, గౌడ యువజన సంఘం, పట్టణ గౌడ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రత్నవరంలో ఘనంగా గంగమ్మ జాతర

నడిగూడెం : మండల పరిధిలోని రత్నవరంలో యాదవుల కులదైవం గంగమ్మ ఆలయం వద్ద సోమవారం గంగమ్మ జాతరను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. చింతలపాలెంకు చెందిన మునగ సైదులు, వెంకమ్మ దంపతులు లక్ష రూపాయలు విలువ చేసే వెండి కిరీటాన్ని స్వామివారికి బహూకరించారు. ఈ కార్యక్రమంలో జడ రాంబాబు, కురాకుల సతీష్, కురాకుల కృష్ణమూర్తి, కురాకుల యల్లయ్య, కమలాకర్, ఉపేందర్, జడ వెంకటేశ్వర్లు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.


రత్నవరంలోని గంగమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

- కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి

కోదాడరూరల్ : ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు అందజేస్తున్న రుణాలను రైతులు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా నిలదొక్కుకోవాలని ఎమ్మెల్యే ఎస్.పద్మావతిరెడ్డి అన్నారు. సోమవారం కోదాడలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కోదాడ పీఏసీఎస్ ఆధ్వర్యంలో 15 మంది పాడి రైతులకు మంజూరైన రూ.45 లక్షల రుణాలను రైతులకు అందజేసి మాట్లాడారు. రైతులు వ్యవసాయంతో పాటు పాడి పరిశ్రమ చేపట్టాలని సూచించారు. రైతులకు సహకార సంఘాలు మరిన్ని మెరుగైన సేవలను అందించాలని ఆమె కోరారు. రైతులు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి సంఘం అభివృద్ధికి తోడ్పడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ ఓరుగంటి శ్రీనివాసరెడ్డి, సీఈఓ మంద వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ బుడిగం నరేష్, డైరెక్టర్లు కమతం వెంకటయ్య, సీతారామయ్య, శెట్టి శ్రీనివాసరావు, బాబు, శెరంశెట్టి వెంకటేశ్వర్లు, రైతులు ఉన్నారు.


రైతులకు రుణాలు అందజేస్తున్న ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి, చైర్మన్ శ్రీనివాసరెడ్డి

యువత సమాజ సేవలో ముందుండాలి

కోదాడరూరల్ : యువత సమాజ సేవలో ముందుండాలని ఎమ్మెల్యే ఎస్.పద్మావతిరెడ్డి అన్నారు. సోమవారం కోదాడ పట్టణంలోని 25వ వార్డులో పేద విద్యార్థులకు బాబా ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్కూల్ బ్యాగులు పంపిణీ చేసి మాట్లాడారు. ప్రతిఒక్కరూ తమకున్న దానిలో పేదవారికి సహాయం చేయాలని అన్నారు. విద్యార్థులు దాతల సహకారంతో చదువుల్లో రాణించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు బాబా, మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని ప్రమీల, మధార్, సుధాకర్, అలీ తదితరులు ఉన్నారు.


కోదాడరూరల్ : విద్యార్థులకు స్కూల్ బ్యాగులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి

నీట్ ఫలితాల్లో అవకతవకలను నిరసిస్తూ రాస్తారోకో

చిలుకూరు : వైద్య కళాశాలలో ప్రవేశాల కోసం నిర్వహించిన నీట్ యూజీ ఫలితాల్లో అవకతవకలను నిరసిస్తూ సోమవారం చిలుకూరు బస్టాండ్ సెంటర్‌లో కోదాడ– జడ్చర్ల జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ డైరెక్టర్ జనరల్ సుబోద్‌కుమార్ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడుతూ.. నీట్ యూజీ ఫలితాల్లో అవకతవకలు జరిగాయని ఆరోపించారు. ఈ విషయమై తక్షణమే సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలని ఆయన డిమాండ్ చేశారు. ఇంటర్ మార్కుల ఆధారంగా వైద్య కళాశాలలో సీట్లు కేటాయించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు అనంతుల రాము, కదారు మధు, నాయకులు మాధవరపు లక్ష్మయ్య, షేక్ జానిమియా, సాయికుమార్, గడ్డం ప్రశాంత్, ఎల్లేష్, రాంబాబు, అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సుబోద్‌కుమార్ దిష్టిబొమ్మ దహనం

నేరేడుచర్ల : నీట్ యూజీ ఫలితాల్లో జరిగిన అవకతవకలపై సుప్రీం కోర్టు సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణ జరిపించి, దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు చిలకరాజు శ్రీనివాస్ ప్రభుత్వాన్ని కోరారు. నీట్ ఫలితాల్లో అవకతవకలను నిరసిస్తూ సోమవారం నేరేడుచర్లలోని హైవేపై ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో నేషనల్ టెస్టింగ్ ఎజెన్సీ డైరెక్టర్ జనరల్ సుబోద్‌కుమార్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నీట్ పరీక్షలో ఒకే గదిలో పక్కపక్కన కూర్చొని పరీక్ష రాసిన విద్యార్థుల్లో 8 మందికి 720కి 720 మార్కులు ఏ విధంగా వస్తాయని ప్రశ్నించారు. పేపర్ లీక్ అయిందా..? లేక మాస్ కాపియింగ్ జరిగిందా..? అనే అంశంపై విచారణ జరిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొమ్మరాజు వెంకట్, సోల్లేటి శివ, నందిపాటి పండు, చిలకరాజు జయంత్, వనపర్తి యశ్వంత్, రాహుల్, నరసింహ, వినయ్ తదితరులు ఉన్నారు.


చిలుకూరు : సుబోద్‌కుమార్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు


నేరేడుచర్లలో సుబోద్‌కుమార్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

బీసీ హాస్టళ్ల మరమ్మతులకు నిధులు విడుదల చేయాలి

మేళ్లచెరువు : రాష్ట్రంలోని ప్రభుత్వ బీసీ హాస్టళ్ల మరమ్మతులకు వెంటనే నిధులు విడుదల చేయాలని బీసీ హక్కుల సాధన సమితి నాయకుడు ధనుంజయనాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాడు. సోమవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. బీసీ హాస్టళ్లు శిథిలావస్థకు చేరుకున్నాయని, హాస్టళ్లలో మౌలిక సదుపాయాలు కరువయ్యాయని తెలిపారు. వాటికి మరమ్మతులు చేపట్టడంతో పాటు హాస్టళ్లకు నూతన భవనాలు నిర్మించాలని ప్రభుత్వాన్ని కోరారు.

మిషన్ భగీరథ నీటి సరఫరాపై ఇంటింటి సర్వే

పాలకవీడు : మండలంలో మిషన్ భగీరథ నీటి సరఫరాపై అధికారులు సోమవారం ఇంటింటి సర్వే చేపట్టారు. పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీలు, మహిళా సంఘాల సభ్యురాళ్లు ఇంటింటికీ తిరుగుతూ నల్లా కనెక్షన్ ఉందా, నీళ్ల సరఫరా అవుతున్నాయా, సరిపడా నీరు అందుతుందా లేదా అనే వివరాలు నమోదు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్, ఐసీడీఎస్, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలపై అప్రమత్తంగా ఉండాలి

నడిగూడెం : రైతులు నకిలీ విత్తనాలపై అప్రమత్తంగా ఉండాలని నడిగూడెం ఎస్ఐ జి.అజయ్‌కుమార్ అన్నారు. జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే ఆదేశాల మేరకు సోమవారం అనంతగిరి మండలం త్రిపురవరంలో పోలీసు కళాబృందం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయానికి, రైతులకు నష్టం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం సోషల్ మీడియా, ఇంటర్నెట్ సద్వినియోగం వంటి అంశాలపై పోలీసు కళా బృందం ఆట, పాటలతో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది వీరబాబు, ప్రతాపరెడ్డి, కళాబృందం ఇన్‌చార్జ్ యల్లయ్య, గోపి, కృష్ణాచారి, గ్రామస్తులు పాల్గొన్నారు.

అనర్హుల వెల్ఫేర్ బోర్డు కార్డులు తొలగించాలి

మునగాల : జిల్లాలో అనర్హులకు ఇచ్చిన వెల్ఫేర్ బోర్డు కార్డులను తక్షణమే తొలగించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం (సీఐటీయూ అనుబంధ సంఘం) జిల్లా కార్యదర్శి ఎలక సోమయ్యగౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం మునగాల మండల కేంద్రంలోని భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యాలయంలో నిర్వహించిన మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో 2009 నుంచి కార్డులు పొందిన కార్మికులు ఆధార్ అప్‌డేట్ కోసం హైదరాబాద్ వెళ్లాలని లేబర్ అధికారులు స్పష్టం చేయడంతో కొందరు అక్కడికి వెళ్లలేక సంక్షేమ పథకాలకు అనర్హులుగా మిగిలిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆధార్ కార్డు అప్‌డేట్ లాగిన్ స్థానిక అసిస్టెంట్ లేబర్ అధికారులకు ఇవ్వాలని కోరారు. జిల్లాలో దళారులు అనర్హులను బోర్డులో చేర్చి సంక్షేమ పథకాలను మంజూరు చేయించడంతో పక్కదారి పడుతున్నాయని ఆరోపించారు. తక్షణమే దళారి వ్యవస్థను నిర్మూలించడానికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న క్లైమ్‌లను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు బచ్చలకూరి స్వరాజ్యం, మండల శాఖ అధ్యక్షుడు షేక్ దస్తగిరి, ప్రధాన కార్యదర్శి మామిడి నాగేంద్రబాబు, పట్టణ అధ్యక్షుడు అల్లి నాగరాజు, ఉపాధ్యక్షుడు కోల ఆంజనేయులు, షేక్ సైదా, ఎం.జాన్‌పాషా, కనకయ్య, సుబ్బారావు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సోమయ్యగౌడ్

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య


మునగాల : మాధవరంలో బడిబాట ర్యాలీలో పాల్గొన్న ఎంపీపీ బిందు, ఉపాధ్యాయులు


నడిగూడెం : రామాపురంలో బడిబాట కార్యక్రమంలో ఎంపీపీ జ్యోతి, ఉపాధ్యాయులు

మునగాల : ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని ఎంపీపీ ఎలక బిందు అన్నారు. సోమవారం మునగాల మండలంలోని మాధవరంలో ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయులు నిర్వహించిన బడిబాట ర్యాలీలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో బోధన ఉంటుందని తెలిపారు. విద్యార్థులకు ఉచితంగా పాఠ్య, నోటు పుస్తకాలు, మధ్యాహ్న భోజనం, దుస్తులు ప్రభుత్వం అందిస్తున్నట్లు తెలిపారు. బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నవీన్‌రెడ్డి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

బడీడు పిల్లలను బడికి పంపాలి

నడిగూడెం : బడీడు పిల్లలను పాఠశాలకు పంపాలని ఎంపీపీ యాతాకుల జ్యోతి కోరారు. సోమవారం నడిగూడెం మండల పరిధిలోని రామాపురం, ఎక్లాస్‌ఖాన్‌పేటలో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. కాగితరామచంద్రాపురంలోనూ బడిబాట నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీఓ దుర్గాప్రసాద్, పంచాయతీ కార్యదర్శి చంద్రకళ, ప్రధానోపాధ్యాయుడు జి.రాందాసు, రామినేని సతీష్, సీఆర్పీ నందిగామ రామారావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.